ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు కష్టమే

- రాహుల్‌ను తిట్టినోళ్లకు టికెట్లా?
- ఎన్నికల ముందు మోదీ సభకు రేవంత్‌రెడ్డి వెళ్లడం తప్పుకాదా?
- కాంగ్రెస్ నేత బక్క జడ్సన్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్లు పొందినవారిని చూస్తే పార్టీ గెలిచేది కష్టమేనని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బక్క జడ్సన్ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీని గతంలో తిట్టినవారికి టికెట్లు ఇస్తే కార్యకర్తలు ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీలో తాజా పరిస్థితిపై సోషల్‌మీడియా వేదికగా ఒక చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో బక్క జడ్సన్ మాట్లాడుతూ.. ఎంపీ టికెట్ల కేటాయింపు, సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి చూస్తుంటే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం కలుగబోతున్నదని హెచ్చరించారు. ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేయడానికి పార్టీలో అభ్యర్థులే లేరా? ఇతర పార్టీల నుంచి వచ్చిన వారికే టికెట్లు ఇవ్వడంలో ఆంతర్యం ఏమిటి? అని ప్రశ్నించారు. మల్కాజిగిరి, చేవెళ్ల అభ్యర్థులు కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేరని అభిప్రాయపడ్డారు. మల్కాజిగిరి అభ్యర్థిగా కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డికి టికెట్ ఇవ్వబోతున్నట్టు తెలిసిందని, నిన్న మొన్న పార్టీలో చేరిన ఆయన ఎలా గెలుస్తాడని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్‌లో వంశీచందర్‌రెడ్డికి స్థానిక నాయకులు సహకరించడం లేదని చెప్పారు. ఒక టీవీ చానల్‌లో రాహుల్‌గాంధీని నానా దుర్భాషలాడిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి భువనగిరి టికెట్ ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఎన్నికల ముందు ప్రధాని మోదీ సభలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనడం తప్పు కాదా? అని ప్రశ్నించారు. ముప్పై ఏండ్ల నుంచి పార్టీలో ఉన్న తనను కొత్తగా పార్టీలోకి వచ్చి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు లాంటి వారు కనీసం గుర్తుపడతారా? అని ప్రశ్నించారు.

నిరుద్యోగుల నిరసన జ్వాల

- జీవో 46ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- గ్రూప్ పోస్టుల సంఖ్యను పెంచాలంటూ ధర్నాకు సిద్ధం
- వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- నిరుద్యోగ నేత అశోక్ అరెస్టు, విడుదల

మహబూబ్‌నగర్ జిల్లా గ్రంథాలయం వద్ద నిరసన తెలియజేస్తున్న నిరుద్యోగులు. (ఇన్‌సెట్‌లో) హైదరాబాద్‌లోని తన ఇంట్లో ధర్నా చేస్తున్న అశోక్

ఎల్బీనగర్, మార్చి 10: నిరుద్యోగులు రగిలిపోయారు.. రాష్ట్ర ప్రభుత్వ వైఖరిపై ధ్వజమెత్తారు.. ఆందోళన బాటపట్టారు. జీవో 46ను రద్దు చేయాలని, గ్రూప్ 1,2,3 పోస్టుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ ఇందిరా పార్కు వద్ద ఆదివారం ధర్నాకు పిలుపునిచ్చారు. నిరుద్యోగ యువతతో కలిసి ఓ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడైన అశోక్ ఇందిరాపార్కు వద్దకు వెళ్లేందుకు యత్నించగా, అనుమతి లేదని పోలీసులు పేర్కొనడంతో దిల్‌సుఖ్‌నగర్‌లోని తన ఇన్‌స్టిట్యూట్ వద్దే ఆయన ఆందోళనకు దిగారు. ఈ దశలో పెద్ద ఎత్తున నిరుద్యోగులు అక్కడికి చేరుకోగా, పోలీసులు అశోక్‌ను అరెస్టు చేసి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీంతో ధర్నా కార్యక్రమం కాస్తా అందోళనకు దారితీసింది. పెద్ద ఎత్తున నిరుద్యోగులు దిల్‌సుఖ్‌నగర్ కూడలి వద్దకు చేరుకొని అక్కడి నుంచి సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్దకు వెళ్లడంతో ఉద్రిక్తత నెలకొన్నది. డీఎస్సీ పోస్టుల సంఖ్యను పెంచాలని, గురుకుల రిక్రూట్‌మెంట్‌ను అవరోహణ క్రమంలో భర్తీ చేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఖాళీలు చాలా ఉన్నా ప్రభుత్వం చాలా తక్కువ పోస్టులనే భర్తీ చేస్తున్నదని, 1,600 పీఈటీ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 182 మాత్రమే ఉన్నట్టు ప్రభుత్వం చూపిందంటూ నిరుద్యోగులు విమర్శించారు.

ఇంటి వద్దే అశోక్ దీక్ష

సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన కార్యక్రమానికి పెద్ద ఎత్తున నిరుద్యోగులు తరలివచ్చి అశోక్‌ను విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. దీంతో వ్యక్తిగత పూచీకత్తుపై అశోక్‌ను విడుదల చేశారు. జీవో 46 రద్దు చేయాలని, గ్రూప్స్ పోస్టుల సంఖ్యను పెంచాలన్న డిమాండ్‌తో చైతన్యపురిలోని తన ఇంటి వద్ద అశోక్ ఆమరణ దీక్ష చేపట్టారు. గ్రూప్1లో 750, 2లో 2వేలు, 3లో మూడు వేల ఖాళీలను పెంచాలని, టెట్ పరీక్ష జరపాలని, డీఎస్సీ ఉద్యోగాల సంఖ్యను పెంచాలని, జీవో 46ను రద్దు చేయాలని అశోక్ డిమాండ్ చేశారు. అంతకు ముందు దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ మెట్రోస్టేషన్ వద్ద కూడా పెద్ద ఎత్తున నిరసనకు దిగిన నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఇదేమి రాజ్యం, ఇదేమి రాజ్యం.. దోపిడి రాజ్యం, దొంగల రాజ్యం.. అన్న నిరుద్యోగ అభ్యర్థుల నినాదాలు మార్మోగాయి. వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. తన ఇంటిలోనే నిరాహారదీక్ష చేపట్టారు.

పాలమూరులో నిరుద్యోగుల నిరసన

పాలమూరు, మార్చి 10 : ప్రభుత్వ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ నిరుద్యోగులు నిరసన తెలిపారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మెట్టుగడ్డ గ్రంథాలయ ఆవరణలో ఉద్యోగ నియామకాలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము జాన్సన్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే డీఎస్సీలో సోషల్ స్టడీస్ పోస్టులు పెంచాలని, గ్రూప్-2, గ్రూప్-3 లోనూ పోస్టులు పెంచాలని, టెట్ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్యుత్తును అందిస్తున్నాం

జగిత్యాల జిల్లా ఎస్ఈ సత్యనారాయణ వివరణ

జగిత్యాల, మార్చి 10: వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయడానికి విద్యుత్తుశాఖ ఆధ్వర్యంలో ప్రతి నెలా రెండో శనివారం విద్యుత్తు నిర్వహణను చేపడతామని, ఇది నిరంతరం జరిగే ప్రక్రియ అని జగిత్యాల సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) సత్యనారాయణ తెలిపారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయమని ముందుగానే అన్ని ప్రధాన పత్రికలకు ప్రకటన జారీ చేశామని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో అర్బన్, రూరల్ మండలాల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కార్యక్రమానికి సంబంధించి తమకు ఎలాంటి సమాచారం లేదని, తమ విధి నిర్వహణలో భాగంగా విద్యుత్తు నిర్వహణ పనులు మొదలు పెట్టామని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కార్యక్రమం అని చెప్పగానే 20 నిమిషాల వ్యవధిలో లైన్ క్లియరెన్స్(ఎల్‌సీ) ఇచ్చామని చెప్పారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో.. శాఖల మధ్య సమన్వయ లోపంతోనే విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పట్టభద్రుల ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు.

భట్టి నాపై పగబట్టాడు!

- రేవంత్‌ను సీఎంను చేయాలన్నందుకే కక్ష
- ఖమ్మం టికెట్ దక్కకుండా అడ్డుపడుతున్నారు
- ఢిల్లీలో మీడియా సమావేశంలో సీనియర్ నేత వీహెచ్ కంటతడి

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రేవంత్‌రెడ్డిని సీఎం చేయాలని గతంలో అన్నందుకు డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తనపై పగ సాధిస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీ హనుమంతరావు ఆరోపించారు. గతంలో తాను భట్టికి చేసిన మేలును మరిచి ద్రోహంచేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఖమ్మం టికెట్ తనకే ఇవ్వాలని పార్టీ పెద్దలను కోరేందుకు ఆదివారం ఢిల్లీకి వచ్చిన వీహెచ్ మీడియాతో మాట్లడుతూ.. తనకు టికెట్ రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని కంటతడి పెట్టారు. కాంగ్రెస్ పార్టీకి బీసీ నాయకులు అవసరం లేదు కానీ వారి ఓట్లు కావాలా? అని ప్రశ్నించారు. భట్టి విక్రమార్క ప్రస్తుతం ఈ స్థాయికి రావడానికి కారణం తానేనని, ఆయనకు మొదట ఎమ్మెల్సీ టికెట్ ఇప్పించింది తానేనని చెప్పారు. ఖమ్మం టికెట్ స్థానానికులకే ఇవ్వాలనే వాదన తెరపైకి తెస్తున్నారని, గతంలో ఇక్కడినుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహించిన రేణుకాచౌదరి, పీవీ రంగయ్య నాయుడు, నాదెండ్ల భాస్కర్‌రావు స్థానికులా? అని ప్రశ్నించారు. తాను ఇప్పటికీ రన్నింగ్ రేసులో కూడా పాల్గొంటానని తెలిపారు. ఖమ్మం నుంచి రాహుల్‌గాంధీ తప్ప ఇంకెవరు పోటీచేసినా తాను బరి నుంచి తప్పుకునేది లేదని హెచ్చరించారు. తన శవంపై పార్టీ జెండా కప్పాల్సిందే కానీ పార్టీ మారే ప్రసక్తేలేదని స్పష్టంచేశారు. రాహుల్, సోనియాగాంధీ న్యాయం చేస్తారన్న నమ్మకం ఉన్నదని, తమ కుటుంబం నుంచి తాను ఒక్కడినే రాజకీయాల్లో ఉన్నానని చెప్పారు.

అక్రమాల పుట్ట.. ట్రిబ్!

మొదటిపేజీ తరువాయి...

చేసిన అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొన్నది. ఆ మేరకు జేఎల్ పోస్టులకు 1:2 మెరిట్ జాబితాను విడుదల చేసింది. డెమోలకు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఆహ్వానించింది. జేఎల్ బోటనీ పోస్టుకు సంబంధించి ఎంఎస్సీతో పాటు డిగ్రీలో కూడా బోటనీ చదివి ఉండాలని చెబుతూ పలువురు అభ్యర్థులను డెమోకు కూడా అనుమతించలేదు. నోటిఫికేషన్‌కు విరుద్ధంగా ఆంధ్రా యూనివర్సిటీ నుంచి మైక్రోబయాలజీ చేసినవారే జేఎల్ బోటనీకి అర్హులంటూ మరికొందరిని తిరస్కరించి తుది జాబితాను ప్రకటించింది. ట్రిబ్ తీరుపై బాధిత అభ్యర్థి కోర్టును ఆశ్రయించాడు. వాదనలు విన్న కోర్టు నోటిఫికేషన్ ప్రకారం జేఎల్ బోటనీ పోస్టుకు సంబంధించి యూనివర్సిటీతో సంబంధం లేకుండా మైక్రోబయోలజీ అభ్యర్థులు జేఎల్ బోటనీ పోస్టుకు అర్హులని స్పష్టం చేసింది. సదరు అభ్యర్థిని జేఎల్ బోటనీ పోస్టుకు ఎంపికచేయాలని ట్రిబ్ అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాతో కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ తీర్పు అనంతరం ఇదే తరహా అభ్యర్థనతో మరో అభ్యర్థి కోర్టును ఆశ్రయించగా అవే ఉత్తర్వులు వర్తిస్తాయని కోర్టు మరోమారు స్పష్టం చేసింది. వీరేకాదు మరెందరో అభ్యర్థులు కోర్టును ఆశ్రయించారు.

ఎంపికలో తికమక

టీజీటీ, డీఎల్, జేఎల్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు సంబంధించి ట్రిబ్ విడుదల చేసిన జాబితా అనేక అనుమానాలకు తావిస్తున్నది. ఫిమేల్ జెండర్‌పై మేల్ క్యాండిడేట్లను ఎంపిక చేయడం వివాదాస్పదమైంది. డీఎల్ ఇంగ్లిష్, జేఎల్ ఫిజిక్స్ పోస్టులకు సంబంధించి ఆ జాబితాలో ఇద్దరిని ఫిమేల్ జెండర్‌గా చూపిస్తూ ఇద్దరు పురుష అభ్యర్థులను ఎంపిక చేసింది.

లైబ్రేరియన్ పోస్టుల్లోనూ అనర్హులు

లైబ్రేరియన్ పోస్టులను కూడా అనర్హులకు కట్టబెట్టారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తం 434 లైబ్రేరియన్ పోస్టులకు ట్రిబ్ నోటిఫికేషన్ జారీచేసింది. అందులో 418 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుదిజాబితాను ప్రకటించింది. లైబ్రేరియన్ పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం 2014 తరువాత ఆచార్య నాగార్జున, అలగప్ప, ద్రవిడతోపాటు ఇతర రాష్ట్రాల్లోని యూనివర్సిటీల నుంచి లైబ్రేరియన్ సైన్స్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు అనర్హులు. అయినప్పటికీ ఆ నోటిఫికేషన్‌కు విరుద్ధంగా పలువురిని ఎంపికచేశారని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. అలా ఎంపికైన ఐదుగురిని గుర్తించినట్టు చెప్తున్నారు.

హడావుడి కారణంగానే అవకతవకలు

పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రణాళిక లేకుండా సాగడం, ఒక్క రోజు వ్యవధిలోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పూర్తిచేయడం, వారం రోజుల్లోనే నియామక పత్రాలు అందజేయడం కారణంగా అవకతకలు చోటుచేసుకున్నట్టు అభ్యర్థులు విమర్శిస్తున్నారు. పోస్టుల వారీగా వెలుగులోకి వస్తున్న ఘటనలే అందుకు నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల్లో లబ్ధి కోసం ప్రభుత్వం చేసిన ఈ హడావుడితో అభ్యర్థులు నష్టపోతున్నారని వాపోతున్నారు.

లక్ష్మీపూర్ జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న భూనిర్వాసితులు

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములివ్వం

- ఇప్పటికే ఎల్లంపల్లికి ఇచ్చాం
- ఉన్నయి లాక్కుంటే బతుకుడెట్లా
- ఐదు గ్రామాల ప్రజల ఆవేదన
- లక్ష్మీపూర్ జాతీయ రహదారిపై గ్రామస్థుల రాస్తారోకో

లక్షెట్టిపేట, మార్చి 10 : నిజామాబాద్ నుంచి క్యాతన్‌పల్లి వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేకు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా లేమని లక్షెట్టిపేట, పోతపల్లి, ఇటిక్యాల, సూరారం, గుల్లకోట గ్రామాల ప్రజలు తెగేసి చెప్పారు. ఆదివారం భూ సర్వేకు వస్తున్నారని తెలిసి లక్ష్మీపూర్ స్టేజీ వద్ద జాతీయ రహదారిపై గంటపాటు రాస్తారోకో చేశారు. గతంలో ఎల్లంపల్లిలో చేపట్టిన శ్రీపాదరావు ప్రాజెక్టు కోసం భూములిచ్చామని, ఇగ ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేసుకొని బతుకుతుంటే.. అవి కూడా లాక్కుంటే ఎలాగని ప్రశ్నించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే వద్దే వద్దంటూ నినాదాలు చేశారు. లక్షెట్టిపేట సీఐ నరేందర్, ఎస్సై చంద్రకుమార్ బాధితులతో మాట్లాడారు. 12న అధికారులతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి నేడు శ్రీకారం

భద్రాచలంలో ప్రారంభించనున్న సీఎం

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకం సోమవారం ప్రారంభంకానున్నది. సీఎం రేవంత్‌రెడ్డి భద్రాచలం వేదికగా ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం మణుగూరులో నిర్వహించనున్న బహిరంగసభలో పాల్గొని ప్రసంగిస్తారు. సొంత స్థలంలో ఇల్లు కట్టుకుంటే ప్రభుత్వం రూ.5 లక్షల సాయం అందజేస్తుంది. సొంత జాగ లేనివారికి ఇంటిస్థలంతో పాటు నిర్మాణానికి రూ.5 లక్షలు అందజేస్తారు. ఏటా 4.50 లక్షల ఇండ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇప్పటికే ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు చొప్పున 4,16,500 ఇండ్లు మంజూరు చేసింది. మిగతా 33,500 ఇండ్లను రాష్ట్ర రిజర్వు కోటా కింద ఉంచింది. ఈ పథకం అమలుకు హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల నిధులను సమీకరించింది. వీటి ద్వారా 95 వేల ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం భావిస్తున్నది. ఇందులో గ్రామాల్లో 57 వేల ఇండ్లు, పట్టణ ప్రాంతాల్లో 38 వేల ను నిర్మించనున్నది. వివిధ రకాల ఇంటి నమూనాలు, డిజైన్లను ప్రభుత్వం రూపొందించింది.

బీజేపీలో ఆగని టికెట్ల మంటలు

- మేడ్చల్ జిల్లా అధ్యక్షుడి రాజీనామా
- పార్టీలో చేరిన పలువురు మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): బీజేపీలో ఎంపీ టికెట్ల మంటలు ఇంకా ఆరడం లేదు. మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించారు. మల్కాజిగిరి టికెట్ ఇవ్వనందుకే రాజీనామా చేశారని పార్టీ వర్గాలు చెప్తున్నాయి. జిల్లాకు చెందిన సీనియర్ నేతలను పక్కనబెట్టి బయటి నుంచి వచ్చిన ఈటల రాజేందర్‌ను అభ్యర్థిగా ప్రకటించడంపై ఆయన గుర్రుగా ఉన్నారని తెలుస్తున్నది. మరోవైపు మాజీ ఎంపీలు గోడెం నగేశ్, సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు జలగం వెంకట్రావు, శానంపూడి సైదిరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి గోమాస శ్రీనివాస్ ఆదివారం బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. వీరికి టికెట్లు ఇస్తామన్న హామీ మేరకు పార్టీలో చేరినట్టు సమాచారం. నల్లగొండ ఎంపీ టికెట్‌ను సైదిరెడ్డికి ఇస్తారన్న ప్రచారం నేపథ్యంలో జిల్లా బీజేపీ నేతలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గతంలో సైదిరెడ్డి తమను తీవ్రంగా హింసించారని చెప్తున్నారు.

పీఆర్సీ, పెండింగ్ డీఏపై ఇప్పుడే చెప్పలేం

మొదటిపేజీ తరువాయి...

ఆవేదన వ్యక్తం చేశారు. కీలకమైన సీపీఎస్ రద్దు, పెండింగ్ డీఏల విడుదలపై ప్రకటన ఉంటుందని ఉద్యోగ సంఘాలు భావించాయి. ఈ రెండు అంశాలను కాంగ్రెస్ మ్యానిఫెస్టోలోనూ పొందుపరిచింది. ఇప్పుడేమో వీటిపై క్యాబినెట్, మంత్రివర్గ ఉపసంఘంలో నిర్ణయం తీసుకుంటామని సీఎం ప్రకటించడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సాధారణ బదిలీలు, హెల్త్‌కార్డులు, ఈ-కుబేర్‌లోని పెండింగ్ బిల్లులపై స్పష్టమైన హామీ వస్తుందని భావించినా, పరిష్కరిస్తామని చెప్పారు తప్పితే స్పష్టమైన హామీ లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో రిజిస్టర్డ్ సంఘాలతో కాకుండా గుర్తింపు సంఘాలతో సమావేశాలు నిర్వహిస్తామని చెప్పడంపై కొన్ని సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. సమావేశంలో టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్, టీజీవో అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్‌రావు, టీటీజేఏసీ నుంచి పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, జాక్టో నుంచి సదానందం, యూఎస్‌పీఎస్సీ నుంచి అశోక్‌కుమార్ సహా సింగరేణి, ఐఎన్‌టీయూసీ, స్టాఫ్‌నర్సు, విద్యుత్తు, కేజీబీవీ ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడారు.

సంఘాలతో చర్చించాకే నిర్ణయాలు

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం హామీ ఇచ్చారు. ఉద్యోగులకు తాము ఒకటో తేదీనే వేతనాలు జమచేస్తున్నా ప్రచారం చేసుకోవడం లేదని పేర్కొన్నారు. 11వేల పోస్టుల మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ జారీచేశామని, మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలను భర్తీచేశామని తెలిపారు. రోజుకు 18 గంటల పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నట్టు పేర్కొన్నారు. 95 శాతం మంది ఉద్యోగులు నిజాయతీగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. శాఖలవారీగా సంఘాలు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించినట్టు తెలిపారు. సంఘాలతో చర్చించకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. వివిధశాఖల్లో 1,100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకు ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం తీసుకురావడం పైనా సమావేశంలో చర్చ జరిగింది. గవర్నర్‌తో మాట్లాడి ప్రొఫెసర్ కోదండరాంను శాసనమండలికి పంపిస్తామని, ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవంగా ఉంటుందని పేర్కొన్నారు. 2008 డీఎస్సీ బాధిత అభ్యర్థులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

సెల్‌ఫోన్లతో నో ఎంట్రీ

సీఎంతో సమావేశం సందర్భంగా భద్రతా సిబ్బంది కఠిన ఆంక్షలు విధించారు. సెల్‌ఫోన్లను నిషేధించారు. సమావేశానికి హాజరైన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు తమ ఫోన్లను బయట డిపాజిట్ చేసిన తర్వాతే లోపలికి అనుమతించారు. సీఎం రావడానికి ముందు పలు సంఘాల నేతలు తోసుకురావడంతో మరోదారిలేక సెల్‌ఫోన్లు ఉన్నా వారిని మాత్రం అనుమతించారు. సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నేత హర్షవర్ధన్‌రెడ్డిని సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడనివ్వలేదు. ఆయనకు పరిచయం చేసుకునే అవకాశం కల్పించడంతో పలు సమస్యలను వివరించే ప్రయత్నం చేశారు. సీఎం సెక్యూరిటీ సిబ్బంది మాత్రం ఇక చాలు అంటూ సంకేతాలివ్వడంతో పూర్తిగా ప్రసంగించకుండానే కూర్చుండిపోయారు.

ఉచిత విద్యుత్తుపై హర్షం

రాష్ట్రంలో సర్కారు స్కూళ్లు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు అందిస్తామన్న సీఎం ప్రకటనను పీఆర్టీయూ టీఎస్ స్వాగతించింది. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు పర్వత్‌రెడ్డి, సదానందంగౌడ్, టీఎస్‌జీహెచ్ఎం అధ్యక్షప్రధాన కార్యదర్శులు రాజభాను చంద్రప్రకాశ్, ఆర్‌యూపీపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షప్రధాన కార్యదర్శులు ఎండీ అబ్దుల్లా, కాంతికృష్ణ, బీసీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణుడు హర్షం వ్యక్తంచేశారు.

రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని వినతి

రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరాయి. ఆదివారం ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంను కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై వినతిపత్రం సమర్పించారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి ఉండాలని, గ్రామ, మండల స్థాయిలో ఉద్యోగుల సంఖ్యను పెంచాలని కోరారు. రెవెన్యూ పరిపాలనలో రూరల్, సెమీ రూరల్, అర్బన్‌గా విభజిస్తే ప్రజలకు సేవలు సులభంగా, వేగంగా అందుతాయని వివరించారు. పూర్వ వీఆర్ఏల సమస్యలు కూడా పరిష్కరించాలని కోరారు. కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల సంఖ్య పెరిగిందని, దీనికి అనుగుణంగా క్యాడర్ స్ట్రెంత్‌ను నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు లచ్చిరెడ్డి, రామకృష్ణ, ఎన్ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ పూల్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

సెర్చ్ కమిటీల ఎంపిక మళ్లీ మొదటికి

- మళ్లీ వీసీ పోస్టుకు పోటీపడుతున్న తాజా వైస్‌చాన్స్‌లర్లు
- వారి అధ్యక్షతనే ఈసీ నామినీకి ఎంపిక చేయడంపై అభ్యంతరాలు
- ఫిబ్రవరి 27తో ముగిసిన 10 వర్సిటీల పాలకమండళ్ల గడువు

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని పలు వర్సిటీల వీసీలను ఎంపిక చేసే సెర్చ్ కమిటీల నియామక ప్రక్రియ మళ్లీ మొదటికొచ్చింది. ఇప్పుడున్న వైస్‌చాన్స్‌లర్లు మళ్లీ వీసీ పోస్టుకు దరఖాస్తు చేయడం.. వారి అధ్యక్షతనే సెర్చ్ కమిటీలో సభ్యుడిగా ఉండే పాలకమండలి నామినీని ఎంపిక చేయడమే ఇందుకు కారణం. రాష్ట్రంలోని 10 వర్సిటీలకు కొత్త వీసీల నియామక ప్రక్రియకు ఆశావహుల నుంచి దరఖాస్తులు కోరగా 1,382 దరఖాస్తులొచ్చాయి. ఈ దరఖాస్తులన్నీ 312 మంది నుంచి వచ్చినవే! ఒక్కొక్కరు రెండు మూడింటికి దరఖాస్తులు చేసుకున్నట్టు తెలిసింది.

ప్రభుత్వ నిర్ణయంలో మార్పు

వీసీల నియామక ప్రక్రియను సెర్చ్ కమిటీ చేపడుతుంది. యూజీసీ నామినీ, పాలకమండలి, నామినీ (ఈసీ), ప్రభుత్వ నామినీలతో సెర్చ్ కమిటీ ఏర్పడుతుంది. వర్సిటీ పాలకమండలి (ఈసీ) నామినీల ఎంపిక కోసం ఇటీవలే ప్రత్యేకంగా ఈసీ సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఒక్కో వర్సిటీ నుంచి ఒకరిని నామినీగా ఎంపిక చేశారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నామినీల కోసం ఉన్నత విద్యాశాఖ అధికారులు యూజీసీకి లేఖను రాశారు. ఇక ప్రభుత్వ నామినీల ఎంపిక పూర్తికావడంతో సెర్చ్ కమిటీలు ఏర